

ఠాణా అయిదు గంటలు కొట్టింది. ప్రకాశం ఉలిక్కిపడి నడక వేగం హెచ్చించాడు. అతని నడకలాగానే, మనస్సు వేగంకూడా హెచ్చయింది. 'ఈ వేగంతో నడిస్తే ఇంకొక పది నిమిషాల్లో రహదారి బంగళా చేరుకోవచ్చును' అనుకున్నాడు ప్రకాశం. రహదారి బంగళాకు ఇల్లు మరొక అయిదు నిమిషాల నడక. రహదారిబంగళా జ్ఞాపకం రాగానే ప్రకాశం ఒళ్ళు పులకరించింది. తియ్యటి భావన ఏదో మనస్సుని ఆవరించుకుంది. అతనికి అనుభూతి కొత్తకాదు. గడిచిన కొన్ని సంవత్సరాలబట్టి అది కలుగుతూనే ఉంది. ఆ బంగళాని గురించి ఆలోచిస్తున్నప్పుడు పొద్దున్న పది మించి సాయంత్రం అయిదు గంటలవరకు తన చుట్టూ రాబందులా ఉండే ఆఫీసు ఫైళ్ళగాని, సౌమ్యత అనేది ఏ కోశానా లేకుండా తనని తిట్టే మేనేజరు ప్రవర్తన గాని, ఖాళీజేబులుగాని, కూలిపో డానికి సిద్ధంగా ఉన్న టాపుతో, బుడి దీపపు కాంతిలో 'మనుషులుండే చోటు' అని చెప్పడానికి వీల్లేని తన ఇల్లుగాని

మిన్ను విరిగి మీద పడ్డట్టయింది. అయితే ఇక తనకు కనిపించే అమ్మాయి పెళ్లి అయితే అసలు కనిపించదు. కాని ఆ అమ్మాయికేనా పెళ్లి? లేక వాళ్లక్కయ్యకా? తనకు ఆ అమ్మాయితప్ప మరో అమ్మాయి ఎవరూ కనిపించలేదే! అయినా సందేహం తీర్చుకుందామని "ఎవరికి పెళ్లి సంబంధం? వాళ్ల పెద్ద అమ్మాయికా? చిన్న అమ్మాయికా?" అని అడిగాడు. అమ్మ నవ్వింది. నవ్వి "వాళ్లకు ఇద్దరు అమ్మాయిలు లేరురా, కళ్యాణి ఒక్కర్తే. ఇప్పుడా అమ్మాయికే సంబంధం చూసేది" అంది.

"ఆహా! అలాగా" అని ప్రకాశం అక్కడనుంచి లేచి వెళ్లిపోయాడు.

'కళ్యాణిట పేరు! ఎంత చక్కగా ఉంది! మనిషికి తగ్గట్టే ఉంది' అనుకున్నాడు ప్రకాశం. కాని అతని మనసులో బాధ తొలిచేస్తూంది. 'ఆ అమ్మాయికి రేపు పెళ్లి అయిపోతుంది. ఎవడో అదృష్టవంతుడు ఎగరేసుకు చక్కాపోతాడు! ఇక తనకు రోజూ వట్టి బంగళా కనిపిస్తుంది.' ఈ ఆలోచనతో ప్రకాశం ఫలించిపోయాడు.

ఆ అమ్మాయి ఉండకపోతే తను ఎలా ఉండగలడో ఊహించుకోలేకపోతున్నాడు. ఛీఛీ, ఆ అమ్మాయినితనే పెళ్లిచేసుకుంటే! అంత ఆలోచనలోను, ప్రకాశానికి నవ్వువచ్చింది. తనలో ఏం చూసి చేసుకుంటుంది ఆ అమ్మాయి? చదువా? లేదు. అందమా? అంతంత మాత్రమే. డబ్బా అసలులేదు. కానిఎందుకోమానసికంగా నైనా ఆ అమ్మాయిని వదులుకోడం ప్రకాశానికి ఇష్టం లేదు. అతనికి తన దరిద్రంమీద కోపం వచ్చింది. అమ్మమీద కోపం వచ్చింది. చెల్లిమీద కోపం వచ్చింది. చివరికి తనకేమీ దారి చూపించకుండా పోయిన నాన్నమీదకూడా కోపం వచ్చింది. కాని కోపం వచ్చి, ఏం చెయ్యలేకపోయాడు ప్రకాశం. నిస్సహాయంగా ఉండిపోయాడు. అతనికి జీవితం దుర్భరమనిపించసాగింది. తనలో తనే దిగులుపడ సాగాడు. అన్నంకూడా సరిగా తినడం మానేశాడు. అమ్మకు మరింత దిగులు కలిగింది. ఉన్న ఒక్క కొడుకు అలా మథనపడడానికి ఆమె కారణం తెలుసుకోలేక పోయింది.

మరి పదిహేను రోజుల తరవాత, రహదారిబంగళా మళ్లీ కలకల లాడడం మొదలెట్టింది. రావుబహద్దరు గారు మళ్లీ కుటుంబంతో దిగారు. పువ్వులచెట్లు మళ్లీ పూయడం మొదలెట్టాయి. ప్రకాశం హృదయం కొంచెం తేరుకుంది. అతనికి మళ్లీ ఊహాసుందరి దర్శనం కలుగుతూంది. ప్రకాశం తిరిగి ఉత్సాహంగా ఉండసాగాడు. అయినా అతని మనసులో ఏ మూలో కొంచెం బాధ పేరుకుని ఉంది. దాని ఛాయలు అప్పుడప్పుడు మొహంమీద ప్రస్ఫుటమయ్యేవి. చివరికి ఒక రోజు అతనికి అమ్మ శుభవార్త తెచ్చింది. "పాపం, ఆ అమ్మాయికి అనుకున్న సంబంధం కుదరలేదుట్రా! కట్నం దగ్గిరే ఏదో పేచీ వచ్చిందట. పెళ్లికొడుకు తరఫువాళ్లు ఏదో పెద్ద మొత్తమే అడిగారుట. వీళ్లు ఇవ్వగలిగినప్పటికీ, అంత ఇవ్వ వలసిన అవసరం లేదని చెప్పి ఒప్పుకోలేదుట. ఎంతైనా ఎవరికైనా ఆ ఘడియ రావాల్లే!" అంది. ప్రకాశం మనసు, మనస్సులో లేదు. గాలిలో తేలిపోయింది.

'అమ్మయ్య! అంటే ఆ అమ్మాయి ఇక్కడే ఉండి పోతుందన్నమాట' అనుకున్నాడు. ఆ రోజంతా, ప్రకాశం చాలా హుషారుగా గడిపాడు. చెల్లెలికి స్వీట్లు పట్టుకు వచ్చాడు. సినిమాకు తీసుకువెళ్లాడు. ఆ వార్తవిని ఎందుకంత హుషారుగా ఉన్నాడో, అమ్మకి అర్థం కాలేదు. ఏదోలే అనుకుని ఊరుకుంది. అవును మరి! ప్రకాశానికి, ఆ అమ్మాయికి ఉన్న అనుబంధం అమ్మకేం తెలుసు? తరవాత ప్రకాశం బుర్ర ఇంకో విధంగా పనిచెయ్య సాగింది. తను బి. కాం. పాసయితే కనీసం తనకు మూడు వందలమీద ఉద్యోగం వస్తుంది. తను ప్రైవేటుగా కట్టి ఎందుకు పాసవ కూడదు? ఆ అమ్మాయి పెళ్లి, ఇలా ఇంకొక ఏడాది వాయిదా పడిందంటే, తను అనుకున్న విధంగా పరీక్ష పాసయితే, తను మంచి స్థితిలో ఉంటాడు అప్పటికి. తనే ఆ అమ్మాయిని పెళ్లాడెయ్యచ్చు. ఇప్పుడే సంబంధాలు చూస్తున్నారు. ఇంకా ఒక ఏడాది పెళ్లి చెయ్యకుండా ఆ అమ్మాయిని ఉంచుతారా? అన్న సందేహం ప్రకాశానికి రాలేదు. ఆ రోజే ఉత్సాహంగా వెళ్లి ప్రైవేటుగా బి. కాం. కు ఎలా కట్టాలో తెలుసుకున్నాడు. ప్రైవేటుగా చదవడానికి సుమారుగా ఒక రెండు వందల రూపాయిలు అవుతుందని తెలుసుకున్నాడు ప్రకాశం. అదేమంత పెద్ద మొత్తం కాదు. ఒక వంద రూపాయిలు ఇప్పుడే అమ్మ దగ్గిర ఉన్నట్టుంది. చెల్లెలి చేతులకి గాజులు కొందామని నిలవ చేస్తూంది. ఇంకొక వంద అప్పు తేవాలి. అసలు తన కెవరైనా పాత పుస్తకాలు ఇస్తే, ఇంకొక వందకూడా అవసరం ఉండక పోవచ్చు. డబ్బు కట్టడానికి, ఇంకా ఎంత వ్యవధి ఉందో తెలుసుకున్నాడు. మూడు నెలలు ఉంది. ఆ తరవాత ప్రకాశం ఉత్సాహంగా పని చెయ్యడం మొదలెట్టాడు. పుస్తకాలూ అవీ సంపాదించేడు. రాత్రిపూట కూచుని శ్రద్ధగా చదవడం ప్రారంభించేడు. మొదట్లో కొంచెం కష్టంగా ఉన్నా, రామరాను అలవాటయి పోయింది. ఇప్పుడు బాగానే చదవగలుగుతున్నాడు. ప్రకాశంలో ఈ మార్పు చూసి అమ్మ సంతోషించింది. ఏదో వృద్ధిలోకి వస్తే, అంతే చాలనుకుంది. చదివి, చదివి అలిసిపోయిన ప్రకాశం, రహదారిబంగళాలోని అమ్మాయితో తన రాబోయే మధురమైన భవిష్యత్తుని గురించి ఊహిస్తూ నిద్ర పోయేవాడు.

చివరికి అనుకున్న రోజు రానే వచ్చింది. ప్రకాశం ఆ రోజు డబ్బు కట్టాలి. డబ్బు తీసుకుని, అమ్మ దగ్గిర ఆశీర్వాదం పుచ్చుకుని బయలుదేరబోయాడు. చెల్లెలు దగ్గిరికి వచ్చి "అన్నయ్యా! ఈ రోజు నా పుట్టినరోజుట! కొత్తబట్టలు తేవూ?" అని అడిగింది. ప్రకాశం "ఓ! అలాగే!" అని బయలుదేరాడు. నిజానికి, అతను కట్టవలసిన దానికంటే ఎక్కువే డబ్బు ఉంది. అందుకే చెల్లెలికి హామీ ఇచ్చాడు. ఆఫీసులో పర్మిషను తీసుకుని, మధ్యాహ్నమే బయలు దేరి డబ్బు కట్టేశాడు. తరవాత బట్టలషాపులన్నీ తిరిగి, చెల్లెలికి ఒక జాకెట్టు, పరికిణీ తీసుకున్నాడు. తిరిగి మెల్లిగా ఇంటికి వస్తూండగా రహదారిబంగళా దగ్గిర కలకలం విని తొందరగా నడిచి అక్కడికి చేరుకున్నాడు. రహదారిబంగళా అంతా పనివాళ్లతో కోలాహలంగా ఉంది. తాటాకులూ అవీ తీసి, పెద్ద

అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్
వెలసరి రు. 10/-

లబహు సులభమైన వాయిదాల మీద. జగద్విఖ్యాత మైనది. ప్రపంచ విఖ్యాతవాణి, పోర్టబుల్, 3 బాండ్లు, జపాన్ మాడెల్. ప్రతి గ్రామమునకు, ఏటికి పంప నగును. నేడే వ్రాయండి.
ALLWORLD AGENCY,
Kalyanpura, Delhi-6.

తెల్ల వెంట్రుక లుండవు
పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా 'కేశరంజన్' ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వానిని నల్లవిగా మార్చి, ఆటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధిపరచును. లాభం పొందిన వారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర: రు. 10/-.
WESTERN INDIA CO. (S.N.)
P.O. Katisarai (GAYA)



పందిరే వేస్తున్నారు. రాటలకి రంగు రంగుల కాయితాలు అవీ అంటిస్తున్నారు. పొద్దున్న ఏమీ లేనివి, ఇప్పు డెక్కడనుంచి వచ్చాయో అతనికి అర్థం కాలేదు. అతని మనసులో మళ్లీ అనుమానం బయలుదేరింది.

'కొంపతీసి, ఆ అమ్మాయికి పెళ్లి కుదిరిపోలేదు కదా! అమ్మ ఈ రోజు పార్వతమ్మగారింటికి వెళతానంది. అమ్మను కనుక్కోవాలి' అనుకుంటూ, దుగ్ధతోకూడిన మనసుతో ఇంటికి వచ్చాడు. అప్పటికే అమ్మ ఇంటికి వచ్చేఉంది. చెల్లెలు చేతిలో పాకెట్టు చూడగానే "కొత్తబట్టలు, కొత్తబట్టలు" అంటూ అది లాక్కుని లోపలికి పరిగెత్తింది. ప్రకాశం "అమ్మా! అమ్మా!" అని పిలిచాడు. "ఏమిట్రా?" అని అమ్మ బయటికి వచ్చింది. "ఈ రోజున ఆ రహదారిబంగళాలో పందిరి, అదీ వేస్తున్నారు ఎందుకు?" అని అడిగాడు.

"అదా అప్పుడు చెప్పలే వాళ్ల అమ్మాయి కళ్యాణికి సంబంధం తప్పిపోయిందని. ఇప్పుడు వాళ్లే మళ్లీ ఒప్పుకుని, చేసుకోడానికి వస్తున్నారు. రేపు లేదు ఎల్లుండే పెళ్లి. మన్నికూడా పిలిచారు. నువ్వూ, చెల్లీ వెళుదురుగానిలెండి" అని అమ్మ లోపలికి వెళ్లిపోయింది. ప్రకాశానికి నవనాడులూ కుంగిపోయినట్టయ్యాయి. మనసుని ఎవరో బలంగా పీకేసి, దూరంగా విసిరేసినట్టయ్యాడు. కాళ్లు చచ్చుబడిపోయాయి. 'ఇంక తను చదివి ఏం చెయ్యాలి' అనుకున్నాడు ప్రకాశం. అతనికి కసి కలిగింది. 'ఛ! ఈ బ్రతుకు బ్రతక్కపోతేనేం?' అనుకున్నాడు విరక్తిగా. రూములోకెళ్లి విస్సారంగా కుర్చీలో చతికిలపడ్డాడు. కళ్లు ఎర్రబడ్డాయి. జ్వరం వచ్చినవాడిలా అయిపోయాడు. రూములో పుస్తకాలు చూడగానే అతనికి మరింత కోపం వచ్చింది. అవి తీసి మూలనున్న గదిలోకి విసిరేశాడు. చప్పుడు విని అమ్మ బయటికి వచ్చింది. కుర్చీలో దిగాలుపడి కూర్చున్న ప్రకాశాన్ని చూడగానే, అమ్మకు ఏదో జరిగిందనిపించింది. 'ఏమిటి ఇలా మారిపోతున్నాడు ఈ మధ్య!' అని అనుకుంది. కాని అది కప్పిపుచ్చుకుని, "ప్రకాశం! అన్నం పెట్టాను, రా!" అంది. ప్రకాశం ఆకలిగా లేదన్నాడు. మళ్లీ పిలిచింది. అప్పుడు మాట్లాడ లేదు. మళ్లీ పిలిచేసరికి ప్రకాశం విరుచుకు పడ్డాడు. "నా కాకలి లేదని చెబితే, వినిపించడం లేదూ? నన్ను పీడిస్తేగాని మీకు సుఖంగా ఉండదా ఏం?" అన్నాడు. అని పక్కమీదకు వెళ్లి అటు తిరిగి పడుకున్నాడు. "అవేం మాటలురా!" అని అమ్మ గొణగడం అతనికి వినిపించింది. తరవాత చెల్లి మెల్లిగా గదిలోకి వచ్చింది. "అన్నయ్యా! నా కొత్తబట్టలు చూడవూ?" అంది. ప్రకాశం కదలలేదు. తరవాత చెల్లి మెల్లిగా ప్రకాశం చెయ్యి పట్టుకుని లాగింది "అన్నయ్యా! చూడన్నయ్యా! మళ్లీ విప్పి దాచేసుకోవాలి" అని. అప్పటికీ ప్రకాశం కదలలేదు. ఈ సారి కొంచెం గట్టిగా చెయ్యి పట్టుకుని లాగింది. ప్రకాశం సహనం తెగిపోయింది. "పడుకున్న వాణ్ణి లేవద్దని ఎన్నిసార్లు చెప్పాను" అని వీపుమీద చెళ్లున ఒకటి వేశాడు. వేసిన తరవాత అతని మనస్సు కలుక్కుమంది. ఈ చెల్లి వంటిమీద చెయ్యి వెయ్యడం అతనికిది మొదటిసారి. కాని అప్పటికే చెల్లి చెంపలు తడిసిపోయాయి. చెల్లి అమ్మదగ్గిర కూచుంది. అమ్మ నిశ్శబ్దంగా చెల్లిని దగ్గిరికి తీసుకుని, అన్నం తినసాగింది.

చెల్లిని కొట్టిన తరవాత, ప్రకాశానికి మనసు ఇంకా బరువెక్కింది. 'తను ఈ రోజు ఇలా అయిపోయేడేం?' అని ఆలోచించసాగాడు. అతనికి దుఃఖం వచ్చింది. అలాగే దిండుమీదికి ఒరిగాడు. ఒక పదిహేను నిమిషాల తరవాత అమ్మ గదిలోకి వచ్చింది. ప్రకాశం జుత్తులో మెత్తటి వేళ్లు దువ్వగానే అతనికి మరింత దుఃఖం వచ్చింది. అమ్మ మెల్లిగా జుట్టు నిమురుతూ "లేనిపోని ఆశలు పెట్టుకోడం మనవంటివాళ్లకు తగదు బాబూ! ఉన్నంతలోనే తృప్తి అనుభవించాలి" అని బయటికి వెళ్లిపోయింది. వెళ్లిపోతున్న అమ్మ వేపు ఆశ్చర్యంగా చూశాడు ప్రకాశం. తన మనసులో ఏముందో అమ్మకి తెలిసిపోయిందన్నమాట. అతనికి ఈ ఆలోచన వచ్చేసరికి సిగ్గు కలిగింది. 'అమ్మ ఎలా గ్రహించింది?' ప్రకాశానికి చిన్నప్పటినుంచి జరిగినవి జ్ఞాపకం రాసాగాయి. 'ఆ మాటకొస్తే, తన మనసు అమ్మ గ్రహించని దెప్పుడు? తన కేది కావాలో, చిన్నప్పటినుంచీ, తనకంటే అమ్మకే బాగా తెలుసు.' ఒక్కసారి అమ్మరూపం వేపు చూసేసరికి ప్రకాశం చలించిపోయాడు. 'రెండేళ్ల కిందట అమ్మ ఎలా ఉండేది? కలకలలాడుతూ, ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ, ఇల్లు స్వర్గంలా ఉంచేది. అలాంటి అమ్మ ఇప్పుడెలా ఉంది? మాసినచీరతో, మెళ్లోను, చేతులకి ఏమీ లేకుండా, కళ్లకింద దిగులుని సూచించే నల్లటి చారలతో ఎలా అయిపోయింది! ఒక్క రెండేళ్లలో ఇంత మార్పు ఎలా సంభవించింది? అప్పటికీ, ఇప్పటికీ అమ్మ కళ్లల్లో కనిపించేది ఒకటే. ఆప్యాయత. ఆనాడు ఎంత ఆదరణ లభించేదో తనకి అమ్మదగ్గిర ఈనాడూ అంతే లభిస్తోంది. అటువంటి అమ్మమీదనా తను విసుక్కోవడం?' ప్రకాశం తల కిందికి దించుకుపోయింది. హఠాత్తుగా అతనికి ఒక ఆలోచన వచ్చి ఒళ్లు ఝల్లుమంది. 'అమ్మ ఏం చూసుకుని బ్రతుకుతూన్నట్టు? ముప్ఫయి అయిదేళ్ల జీవితంలో మోడువారిపోయిన జీవితంతో అమ్మ ఎలా రోజులు గడిపివేస్తోంది? ఇరవయ్యేళ్లు రాగానే తనకి ఇంత మనోనిగ్రహం నడలిపోతూంటే, ఏ ఆశాలేని అమ్మమనసు ఎలా కూడగట్టుకోగలుగుతూంది? తనను, చెల్లిని అభివృద్ధికి తీసుకురావాలనే ధ్యేయం తప్ప అమ్మకు మిగిలిన ఆశయమేమిటి? అలాటి అమ్మను సుఖపెట్టడానికి తను ఏమీ చెయ్యకుండా పైగా విసుక్కున్నాడు.' ప్రకాశం మనసు బాధ పడసాగింది. లేదు. అమ్మకి తను క్షమాపణ చెప్పుకోవాలి ఎలా? ఆప్యాయంగా దగ్గిరికి వచ్చిన చెల్లెల్ని కొట్టినప్పుడు అమ్మకు ఎంత బాధ కలిగిందో? చెల్లెల్ని తలుచుకునేసరికి ప్రకాశానికి తనేదో మహాపరాధం చేసినట్టు స్ఫురించసాగింది. 'చెల్లి రోజూ తన మంచం పక్కనే పడుకునేది. ఈ రోజు రాలేదు. తనమీద అలిగి ఉంటుంది. అమ్మ వ్యక్తిత్వం ముందర తన వ్యక్తిత్వం చాలా అల్పమైనట్టుగా ప్రకాశానికి గోచరించసాగింది. చివరికి ఒక దృఢ నిశ్చయానికి వచ్చాడు ప్రకాశం. 'అమ్మ చెప్పింది నిజమే. తను లేనిపోని ఆశలు పెట్టుకోకూడదు. ఇక తను ఆ రహదారిబంగళాఅమ్మాయినిగాని, మరెవ్వరిని గాని తలుచుకోడు. తన ముందర విధ్యుక్తధర్మం అమ్మనూ, చెల్లినీ సుఖపెట్టడమే. తన జీవితమంతా ధారపోసిఅయినా సరే వాళ్ల జీవితాలని ఆనందమయం చెయ్యాలి తను. ఈ నిశ్చయం రాగానే ప్రకాశంమనసు తేలికైంది. భారమంతా దిగిపోయింది. దిగ్గున లేచి గదిలోకి నడిచాడు. చెల్లి ఒక్కర్తే చాపమీద పడుకుని నిద్ర పోతూంది. బుగ్గలమీద ఇంకా కన్నీటి చారికలు పోలేదు. కొత్త పరికిణీ, జాకెట్టుతోనే పడుకుంది. ప్రకాశం హృదయం కరిగిపోయింది. మెల్లిగా వంగి చెల్లెలి తెల్లటిబుగ్గలమీద ముద్దు పెట్టుకున్నాడు. ఆ తరవాత విసిరేసిన పుస్తకాలు తెచ్చుకుని దీపం ముందర కూర్చున్నాడు.

పక్కగదిలో అమ్మ కళ్లు ఒత్తుకుంది. ★

ఉచితము ! ఉచితము !!

**తెల్ల మచ్చలు**

మా ప్రఖ్యాతివహించిన 'దాగ్‌సాఫ్' ప్రత్యేక ఔషధము తెల్ల మచ్చలను సులభముగ పోగొట్టుటలో 1925 సం. నుండి ప్రఖ్యాతి వహించి యున్నది. మూడు రోజులు వాడినంతనే మచ్చలు తెలుపుతనం, కొన్ని రోజులలో సమూలంగా నాశనము చేయుగల శక్తి కలిగియున్నది. ఉచితంగా ఒక పాకెట్ మందు యివ్వబడును. నకలును చూచి మోసపోకండి.

WESTERN INDIA CO. (V.N.)
P.O. Katrisarai (GAYA)

